గిరి పుత్రికల నృత్య నీరాజనం

కృష్ణా జలాలకు స్వాగతం పలుకుతూ దోర్నాల హెడ్ రెగ్యులేటర్ వద్ద 1,500 మంది గిరిజన విద్యార్థినులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దోర్నాల గిరిజన పాఠశాలకు చెందిన 438 మంది, పుల్లల చెరువు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం తదితర ప్రాంతాల నుంచి 312 మంది, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, పల్నాడు తదితర జిల్లాల్లోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలకు చెందిన 750 మంది బాలికలు ఈ వేడుకలో భాగస్వాములయ్యారు. పదానికి అనుగుణంగా పాదాలు కదుపుతూ తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వీరి నృత్యానికి ముగ్ధులై ప్రత్యేకంగా అభినందించారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. ప్రాజెక్టు వద్దకు తరలి వచ్చిన ప్రజలు కూడా వీరి నృత్యాన్ని ఆస్వాదించారు. బాలికల ప్రతిభను ప్రతిఒక్కరూ ప్రశంసించారు.

"మార్కాపురం అన్‌స్టాపబుల్. మీ కోరిక మేరకు జిల్లా ఇచ్చాం. మీ చిరకాల స్వప్నం వెలిగొండను సాకారం చేశాం.ఇక జిల్లా అభివృద్ధికి తిరుగులేదు.

"వెలిగొండ అంటే కరవుపై గెలవాలనే సంకల్పం, మూడు దశాబ్దాల పోరాటం, రైతు భవిష్యత్తుకు నమ్మకం

"వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు, కరవు నేలపై కృష్ణమ్మ రాసిన చరిత్ర ఇది.

"వెలిగొండ బంగారు కొండ అవుతుంది ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది.

"శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ..మార్కాపురం చెన్నకేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తుంది.

- వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

మారెను జలగాత.. మురిసెను భూమాత

- మార్కాపురం జిల్లాకు వెలిగొండ వెలుగులు
- కృష్ణా జలాలను చూసి పరవశించిన జనం
- ప్రజలను ఉత్తేజపరుస్తూ సాగిన సీఎం ప్రసంగం

ఐక్యతారాగం... ప్రగతి నినాదం

వేదికపై సంఘీభావం తెలుపుతున్న సీఎం, ప్రజాప్రతినిధులు

ఈ క్షణం.. ఆనంద వీక్షణం

సీఎంను చూసిన ఆనందంలో వీడియోలు తీస్తున్న జనం

మోడు వారిన ఆశలు
మళ్లీ చిగురించాయి
బీడు వారిన భూమి
పంట పండుతానంటోంది
కంఠం దిగని గరళ జలం
కాళ్లను కట్టేసిన ఫ్లోరైడ్ భూతం
ఇక సెలవు చెప్పనున్నాయి
అసాధ్యమనుకున్న కల
సుసాధ్యమైన వేళ
కరవు నేలను కృష్ణమ్మ
ముద్దాడిన సమయాన..
దశాబ్దాలుగా ఈ క్షణం కోసం
ఎదురు చూసిన ఆ రైతన్నల
కళ్లు చెమర్చాయి..
ఆనంద బాష్పాలు రాల్చాయి!!

– న్యూస్‌టుడే, బృందం

దశాబ్దాల కలగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టు కళ్ల ముందు సాకారం కావడంతో మార్కాపురం జిల్లా వాసుల ఆనందానికి అవధులే లేవు. సోమవారం దోర్నాల మండలం గంటవానిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరైన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభకు పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. మహిళలు, చిన్నా పెద్దా తేడా లేకుండా భారీగా హాజరయ్యారు. సీఎం వెళ్లే వరకు కూడా ఉండి వీక్షించారు. కృష్ణా జలాలు తమ ప్రాంతంలో పరవళ్లు తొక్కడం చూసి పరవశించిపోయారు. ప్రతిఒక్కరూ ఆ నీటి గలగలలు చూసి తన్మయత్వానికి లోనయ్యారు. సీఎం చంద్రబాబు జలహారతి ఇచ్చిన తరువాత భావోద్వేగానికి లోనై కృష్ణమ్మ తల్లికి సాష్టాంగ ప్రణామం చేశారు.

ఎటు చూసినా జనాలే..

వెలిగొండ ప్రాజెక్టు చూద్దామనే భావనతో చాలామంది స్వచ్ఛందంగా వచ్చారు. గ్రామాలకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినా సరిపోక వాటి పైభాగానకెక్కి ప్రయాణించాల్సి వచ్చింది. బైకులు, ఆటోలు, ఇతరేతర వాహనాల్లో తరలివచ్చారు. గంటవానిపల్లె శివారున ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి పొలాల నుంచి, గట్ల నుంచి, ఎటువైపు చూసినా జనాలు కనిపించారు. ఫీడర్ కాలువ మొత్తం సందర్శకులతో నిండిపోయింది. వచ్చినవారంతా సెల్ఫీలు దిగారు. సీఎం వెళ్లిన తరువాత సాయంత్రం ఆరు గంటల వరకు సందర్శకుల తాకిడి కాలువ వద్ద కనిపించింది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఎం పర్యటన సజావుగా సాగడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

రెండో దశ పూర్తయితే ఇక్కడే పుష్కరాలు

సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో వెలిగొండ ప్రాజెక్టుతో ఈ ప్రాంతం ఎలా మార్పు చెందుతుందనేది ప్రస్తావించారు. పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి ఎదురే లేదు.. అని చెబుతూ మార్కాపురం.. అన్‌స్టాపబుల్.. అంటూ సభికులతో అనిపించారు. ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందంటూ వివరించారు. వెలిగొండ రెండో దశ పూర్తయితే, కృష్ణా తీరానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే మార్కాపురంలోనే పుష్కరాలు జరుపుకోవచ్చని చెప్పారు. తక్కువ సమయంలో ప్రాజెక్టు పనులు పూర్తిచేసిన మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయసునీత, జేసీ శ్రీనివాసులు, ప్రాజెక్టు ఈఈ కృష్ణారెడ్డి, డీఈ రామస్వామి, ఇంజినీరింగ్ సిబ్బంది, మేఘా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులకు సీఎం చంద్రబాబు ప్రశంసా పత్రాలు అందజేశారు.

అమ్మా. అందుకో



కృష్ణా జలాలకు సారె సమర్పిస్తున్న ముఖ్యమంత్రి, చిత్రంలో మంత్రి నిమ్మల

దారులన్నీ వెలిగొండ వైపే...

ప్రాజెక్టు వద్దకు తరలివస్తున్న ప్రజలు

మాట ఇచ్చాం.. నీళ్లు తెచ్చాం

ఫీడర్ కాలువలో పారుతున్న నీటిని చూపుతున్న ముఖ్యమంత్రి

నీరొచ్చెనంట... వెలుగులు తెచ్చెనంట

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు జలాలు ఇప్పుడు అందరి మదిలో ఆనందాన్ని నింపాయి. దశాబ్దాల కళ నెరవేరిన వేళ అందరి కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సైతం ఇదే పరవశానికి లోనయ్యారు. సీఎం చంద్రబాబు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశాక బాలికలు చేసిన లంబాడీ నృత్యం ఆకట్టుకుంది. ఇదే సందర్భంలో ఎమ్మెల్యే ఉగ్ర ఆనందంతో నృత్యం చేస్తూ కనిపించారు. ఈయనను మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఉత్సాహ పరచడం కనిపించింది.

తరించే తరుణం: మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులపై కృష్ణా జలాలు చల్లుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ముఖ్యమంత్రి పర్యటన సాగిందిలా...

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ముందుగా నిర్ణయించిన సమయం కంటే గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం 11.11 గంటలకు హెలికాప్టర్‌లో గంటవానిపల్లిలోని ఫీడర్ కాలువకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్, నారాయణ, అనగాని సత్యప్రసాద్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, దామచర్ల జనార్దన్, విజయ్‌కుమార్, కాకర్ల సురేష్, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల బాధ్యులు ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఇతర ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో క్రాస్ రెగ్యులేటర్ వద్దకు చేరుకున్నారు. గంటకు పైగా సమయం అక్కడే గడిపారు. నీటి విడుదల, పూజలు, శిలాఫలకం ఆవిష్కరణ తదితర కార్యక్రమాల అనంతరం... మధ్యాహ్నం 12.16 గంటలకు సభా వేదికపైకి చేరుకున్నారు. తిరిగి 2.27కు హెలిప్యాడ్‌కు చేరుకుని... 2.34 గంటలకు అమరావతి బయలుదేరి వెళ్లారు.

చెయ్యెత్తి.. జైకొట్టి

సభకు హాజరైన ప్రజల ఉత్సాహం

రైతుల కన్నీళ్లు ఆగిన రోజు

మార్కాపురం జిల్లా రైతుల కన్నీళ్లు ఆగిన రోజు. మనం కన్న కలలను సాకారం చేసిన రోజు ఇది. ఈ ప్రాంతంలో 1500 అడుగుల లోతు బోర్లు వేస్తే గాని నీరు వచ్చే పరిస్థితి లేదు. కరవుతో పోరాడుతున్న ఈ నేలలో వర్షం పడితే తప్ప మరో మార్గమే ఉండేదికాదు. ఇచ్చినమాట కోసం చంద్రబాబునాయుడు ప్రాజెక్టును పూర్తి చేశారు. కృష్ణాజలాలను తీసుకొచ్చారు. ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు. జిల్లా రైతులంతా ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉండాల్సిన అవసరం ఉంది.

– గూడూరి ఎరిక్షన్‌బాబు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి, యర్రగొండపాలెం

ఒక బాధ్యతగా తీసుకున్నారు

ఈ ప్రాంత ప్రజలను సంతోష పెట్టాలని ఒక బాధ్యతగా తీసుకొని వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తి చేశారు. కృష్ణా జలాలు మన ప్రాంత పొలాల్లోకి వచ్చేలా చేశారంటే సీఎం చంద్రబాబు మనకు దైవంతో సమానం. ఉద్యాన హబ్‌తో మార్కాపురం జిల్లాను అభివృద్ధి చేయబోతున్నారు. ఈ ప్రాంత ప్రజలను ఫ్లోరైడ్ నుంచి రక్షిస్తున్నారు. జిల్లాలో ఇన్ని అభివృద్ధి పనులు చేసిన వారు ఎవరైనా ఉన్నారా అని అందరూ ఆలోచన చేసుకోండి.

–కందుల నారాయణరెడ్డి, ఎమ్మెల్యే, మార్కాపురం

నా కళ్లతో చూస్తాననుకోలేదు...

మా ప్రాంతంలో తాగే నీటిలో, పండించే భూమిలో, తినే తిండిలో విషం ఉంది. పశువుల నుంచి వచ్చే పాలల్లోనూ గరళం ఉంది. అనేక మంది అంగవైకల్యంతో పుట్టారు. తక్కువ వయసులోనే చనిపోతున్నారు. కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేయించుకుంటున్నారెందరో. సకాలంలో సరైన వైద్యం అందక మా ప్రాంతంలో 195 మంది చనిపోయారు. నా జీవితంలో ఇటువంటి రోజు వస్తుందని అనుకోలేదు. నా కళ్లతో ఎప్పుడూ వెలిగొండ జలాలను చూస్తానని అనుకోలేదు. 30 ఏళ్ల కలను సాకారం చేసిన సీఎం చంద్రబాబునాయుడుకు పాదాభివందనం చేస్తున్నా. – ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్యే, కనిగిరి

అభివృద్ధికి ఊతమిచ్చారు...

రైతుల కళ్లల్లో ఆనందం చూడాలని, మన ప్రాంత వాసుల తలరాతలను మార్చాలని 1996లో సీఎం చంద్రబాబునాయుడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మన పశ్చిమ ప్రాంత ప్రజల తరఫున ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఇక్కడి ప్రజల తలరాతను మార్చిన వ్యక్తి చంద్రబాబునాయుడు. వెలిగొండ జలాలను ఇవ్వడం ద్వారా మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలు రాబోయే రోజుల్లో అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయి. మార్కాపురం జిల్లా ఇచ్చి, నీళ్లు తెచ్చిన చంద్రబాబుకు పాదాభివందనం. –ముత్తుముల అశోక్‌రెడ్డి ఎమ్మెల్యే, గిద్దలూరు

నవోదయం కోసం సన్నద్ధం

- ఎక్కువ మంది విద్యార్థులు పరీక్ష రాసేలా కార్యాచరణ

చీమకుర్తి, ఒంగోలు, న్యూస్‌టుడే:

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను నవోదయ పాఠశాలల బాట పట్టించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మానస పుత్రికలుగా రూపుదిద్దుకున్న ఈ నవోదయ పాఠశాలల ప్రవేశ పరీక్షల కోసం ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఎక్కువ మందిని భాగస్వామ్యం చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం సహాయ సంచాలకులు, జిల్లా నోడల్ అధికారి సుబ్బారెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఇటీవల ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.

వెయ్యికి పైగా దరఖాస్తులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఒంగోలు, మార్కాపురంలో నవోదయ పాఠశాలలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 635 పాఠశాలలు ఉండగా జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. ఒక్కో పాఠశాలలో 80 సీట్లు ఉంటాయి. ఈ పాఠశాలల్లో ఆరో తరగతి చదివేందుకు ఏటా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుంటారు. ఆయా పాఠశాలల్లో ఐదో తరగతి చదివే విద్యార్థులు ఇందుకు అర్హులు. నవంబరు 28న జరగనున్న ప్రవేశ పరీక్ష కోసం ప్రకాశం జిల్లాలో 5967, మార్కాపురం జిల్లాలో 4136 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది అధికారుల చొరవతో రెండు జిల్లాల్లో కలిపి దరఖాస్తుల సంఖ్య సుమారుగా వెయ్యి వరకు పెరిగింది.

ప్రత్యేకంగా వాట్సప్ బృందం

విద్యార్థుల సన్నద్ధత కోసం ఆయా మండలాల్లో ఎంపిక చేసిన ఉపాధ్యాయులతో ప్రత్యేక వాట్సప్ బృందం ఏర్పాటు చేయాలని ఇటీవల ఒంగోలు జరిగిన సమావేశంలో సుబ్బారెడ్డి చెప్పారు. రోజూ మధ్యాహ్నం తర్వాత దరఖాస్తు చేసిన విద్యార్థులకు ప్రత్యేకంగా బోధిస్తున్నారు.

ఓటు ఉంటుందా.. ఊడుతుందా..

న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. జూన్ 15 నుంచి జులై 24వ తేదీ వరకు సేకరించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో పేర్కొన్న వివరాల్లో లోపాలున్నాయంటూ ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో మొత్తం 3,65,419 మంది ఓటర్లకు ఈఆర్వో, ఏఈఆర్వోలు నోటీసులు జారీ చేశారు. అందులో షెడ్యూల్ ప్రకారం ఆదివారం సాయంత్రానికి 1,71,509 మంది విచారణకు హాజరయ్యారు. తగిన పత్రాలు సమర్పించని కారణంగా అందులో ఇప్పటి వరకు 226 మందిని అనర్హులుగా గుర్తించారు. నోటీసులు అందుకున్న వారిలో ప్రకాశం జిల్లాలో 55.53 శాతం, మార్కాపురం జిల్లాలో 50.21 శాతం మందిని ఇంకా విచారించాల్సి ఉంది. ఈ నెల 28 లోపు విచారణ పూర్తి కావాలి. అక్టోబర్ 3న తుది జాబితా విడుదల చేయనున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లలో ఎంత మంది తుది జాబితాలో మిగులుతారనే దానిపై అప్పుడు స్పష్టత రానుంది.

ముసాయిదా జాబితాలో తప్పులున్న ఓటర్లకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్వోలు నోటీసులు జారీ చేశారు. 'సర్' ప్రక్రియ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో క్లెయిమ్‌ల అభ్యంతరాల ప్రక్రియ వేగవంతం చేసేలా అధికార యంత్రాంగం ప్రణాళిక చేస్తోంది. నోటీసు అందుకున్న ఓటర్లు సంబంధిత ధ్రువ పత్రాలతో నిర్దేశిత గడువులోపు ఈఆర్వో/ఏఈఆర్వో ఎదుట విచారణకు హాజరవుతున్నారు.

ఒంగోలు ఏఈఆర్వో రాజశేఖర్‌కు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఓటర్లు

తప్పిదాలతో తాఖీదులు

ఆ సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల గుర్తింపు కార్డుల్లో తగిన ఆధారాలు చూపిస్తున్నారు. దూర ప్రాంతాల్లోని వారు ఆధారాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఓటుహక్కుపై ఏఈఆర్వోలు తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇంటి పేరు, తల్లిదండ్రుల పేర్లలో తప్పులు, ఇంటి నంబర్లలో లోపాలు, అక్షర దోషాలు, తండ్రి, కుమారుడి వయసులోనూ వ్యత్యాసాలు ఉండటంతో సంబంధిత ధ్రువ పత్రాలు అందజేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 3,65,419 మంది ఓటర్లకు నోటీసులు

జిల్లా	నోటీసులు	విచారణ చేసింది	అనర్హుల గుర్తింపు	పెండింగ్ ఓటర్లు
ప్రకాశం	1,96,196	87,255	48	1,08,941
మార్కాపురం	1,69,223	84,254	178	84,969

పుట్టుకతోనే బుద్ధిమాంద్యం, ప్రత్యేక అవసరాల పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. చిన్నారుల్లోని లోపాలను సరిదిద్ది మానసిక, వ్యక్తిత్వ వికాసాన్ని పెంచేలా శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేసింది. చూపులేని పిల్లలకు బ్రెయిలీ లిపి నేర్పిస్తున్నారు. వారు బయటకు వెళ్లాలంటే మరొకరిపై ఆధారపడకుండా స్మార్ట్ కెయిన్స్ అందజేశారు. నడిచేటప్పుడు అడ్డంకులు ఉన్నా ప్రమాదం పొంచి ఉన్నా ముందుగా అవి హెచ్చరిస్తాయి. –న్యూస్‌టుడే, మద్దిపాడు

ఆప్యాయత పంచి.. ఆత్మవిశ్వాసం పెంచి

గుర్తింపు ఇలా.. : బడికి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటున్న 3 నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించేందుకు ఏటా ప్రత్యేక సర్వే చేస్తున్నారు. అంగన్‌వాడీ పాఠశాలలకు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. సంబంధిత పిల్లల తల్లిదండ్రులను కలిసి వారికి భవిత కేంద్రంలో అందించే సేవలపై అవగాహన కల్పిస్తున్నారు.

వివరాలు ఇవీ..	ప్రకాశం	మార్కాపురం
భవిత కేంద్రాలు	27	21
చిన్నారులు	752	657
హాజరవుతున్న వారు	537	417
ఇంటి వద్ద సేవలు	191	214

అందించే సాయం..: రవాణా, ఎస్కార్ట్ భత్యంగా ఏటా రూ.6 వేలు, బాలికలకు రూ.2 వేలను అందిస్తున్నారు. వినికిడి లోపం ఉన్నవారికి ప్రత్యేక పరికరాలు అందజేశారు. వారానికి ఒకసారి ఫిజియోథెరపీ సేవలందిస్తున్నారు. చిన్నారులకు బొమ్మలు, ఇతర పరికరాలతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. కేంద్రానికి రాలేని పిల్లలకు శిక్షకులు వారి ఇంటి వద్దకే వెళ్లి పాఠాలు బోధించడమే కాకుండా వ్యాయామాలు చేయిస్తున్నారు. సమాజంలో ఎలా మెలగాలి... ఇతరులను ఎలా గౌరవించాలి.. వంటి ప్రాథమిక అంశాలతో పాటు చిత్రాలను గీయించడం, వివిధ ఆకృతులను తయారు చేయించడం వంటి విషయాల్లో తర్ఫీదు ఇస్తూ వారి మానసిక స్థితిని వికసించేలా కృషి చేస్తున్నారు.

మద్దిపాడు భవిత కేంద్రంలో విద్యార్థులకు ఆట వస్తువులతో శిక్షణ ఇస్తున్న సిబ్బంది

(c) eenadu

మార్కాపురానికి మహోధ్యాయం

● కొత్త జిల్లాకు మంచి రోజులు

శ్రీశైలం, మార్కాపురం, కంభం పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రణాళిక బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో భాజపా నేత మాధవ్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బాలాజీ, మంత్రి రామానాయుడు, యర్రగొండపాలెం తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు

గేటు నుంచి బయటకు వస్తున్న కృష్ణా జలాలు



నృత్యం చేసిన బాలికలతో ఫొటో దిగి విజయసంకేతం చూపుతున్న చంద్రబాబు

ఉత్సాహంగా పచ్చ తువాళ్లు ఊపుతున్న సభకు హాజరైన జనం

కరవు సీమను కృష్ణమ్మ ముద్దాడటంతో అందరిలో ఉత్సాహం పరవళ్లు తొక్కింది. కళ్లారా చూద్దామని ఆబాలగోపాలం పరుగులు పెట్టారు. మార్కాపురం జిల్లాకు మంచి రోజులొచ్చాయని ఆనందించారు. వెలిగొండ జలాల విడుదల కార్యక్రమం సోమవారం ఘనంగా సాగింది. ముఖ్యమంత్రి రాక, కృష్ణమ్మకు జలహారతి, పూజలు, శిలాఫలకం, బ్రోచర్ల ఆవిష్కరణ కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, బృందం

వెలిగొండ జలాలు చూసేందుకు గుట్ట ఎక్కి వస్తున్న వృద్ధులు

వెలిగొండ జలాలు చూసేందుకు కొండ ఎక్కి వస్తున్న ప్రజలు

సీఎం రాక కోసం వేచిచూస్తున్న మంత్రులు, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు తదితరులు

పూజలు చేస్తున్న చంద్రబాబు, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, భాజపా నేత మాధవ్ తదితరులు

కృష్ణా జలాల విడుదల అనంతరం నమస్కరిస్తున్న చంద్రబాబు, పక్కన రామానాయుడు

నీటిని సీసాల్లో ఇంటికి తీసుకెళ్తున్న మహిళలు

వెలిగొండ ఇంజినీర్లకు ప్రశంసలు

సీఎం చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఈఈ కృష్ణారెడ్డి, మేఘా సంస్థ ఇంజినీర్ శ్రీనివాసులు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగ నిర్మాణ పనుల పురోగతిలో తమవంతు పాటుపడ్డ ఇంజినీర్లు, మేఘా సంస్థ సిబ్బందికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రశంసా పత్రాలు అందజేశారు. గంటవానిపల్లె సమీపంలోని ఫీడర్ కాలువ వద్ద సోమవారం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈఈ కృష్ణారెడ్డి, డీఈ రామస్వామిలతో పాటు మేఘా సంస్థలో పనిచేసిన ఇంజినీర్లు, సిబ్బందికి వాటిని పంపిణీ చేశారు.

ఆనందం... వెలికొండంత

ఎప్పటికవుతుందో అనుకునేవాడిని...

కరవు ప్రాంతానికి కృష్ణా జలాలు రావడం శుభపరిణామం. నా చిన్నప్పటి నుంచి ప్రాజెక్టు పనులు చూస్తూనే ఉన్నా. ఎప్పటికి పూర్తవుతాయో అనుకునేవాడిని. కూటమి ప్రభుత్వం అకుంఠిత దీక్షతో తొలివిడత పూర్తిచేసి జలాలు తీసుకువచ్చింది. వెనుకబడిన ప్రాంతం రూపు మారనుందన్న సంతోషం ఈ ప్రాంతవాసుల్లో కనపడుతోంది. వేడుకలో భాగస్వామిని కావాలని పల్నాడు జిల్లా వినుకొండ నుంచి వచ్చా.

– సుబ్బారావు, వినుకొండ

బోర్లు ఎండిపోవు...

మా గ్రామంలో భూగర్భ జలాలు పడిపోయి బోర్లకు సక్రమంగా నీరందక పంటలు సరిగా పండించలేకపోయేవాళ్లం. సేద్యం ఎప్పుడూ కత్తి మీద సాములానే ఉండేది. వెలిగొండ జలాలతో ఆ సమస్య తీరుతుంది. బంగారు పంటలు పండి... మా జీవితాలు బాగుపడతాయి. నిత్యం పనులు దొరుకుతాయి. ఉపాధి కోసం వలసలు వెళ్లే దుస్థితి ఉండదు. కూటమి ప్రభుత్వ కృషితోనే ఇది సాధ్యమైంది. కృష్ణా జలాలు చూసేందుకు వచ్చాం.

– వెంకటమ్మ, కట్టకానిపల్లి, దోర్నాల మండలం

స్థానికంగానే పనులు...

మా ప్రాంతంలో వ్యవసాయ పనులు లేక పక్క మండలాలకు ఆటోల్లో వెళ్లేవాళ్లం. వెలిగొండ జలాలతో ఆ బాధలు తప్పుతాయి. మా ఊళ్లోనే పొలం కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటాం. పెద్ద కాలువకు నీళ్లు రావడం చాలా ఆనందంగా ఉంది. వేడుక తిలకించేందుకు ఇంత మంది రావడం చూస్తుంటే మనస్సు ఉప్పొంగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలతోనే వెలిగొండ సాధ్యమైంది. – మార్తమ్మ, గార్లదిన్నె

- న్యూస్‌టుడే, కంభం, అర్ధవీడు

మా ఊరి సమీపంలోనే వేడుక...

గతంలో ఫీడర్ కాలువ కోతకు గురైనప్పుడు ఆందోళనకు గురయ్యాం. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతోనే ప్రాజెక్టు త్వరగా పూర్తయ్యింది. నీళ్లు చూస్తుంటే చెప్పలేనంత సంతోషంగా ఉంది. మా ప్రాంతం పైరు పంటలతో కళకళలాడడంతో పాటు భవిష్యత్తు తరాలకూ మేలు కలుగుతుంది. మా ఊరి సమీపంలోనే ప్రాజక్టు ప్రారంభించడం ఆనందంగా సాగింది. గ్రామ చెరువును నింపితే ఇంకా బాగుంటుంది.

– వెంకటలక్ష్మమ్మ, గంటవానిపల్లి

వెబ్‌సైట్‌లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల జాబితా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత, మున్సిపల్, నగరపాలక సంస్థ పాఠశాలలకు ఎంపికైన 205 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ అభ్యర్థుల జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో సీవీ. రేణుక తెలిపారు. ఎంపికైన వారు సెప్టెంబర్ ఒకటిన వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాల్సిందిగా సూచించారు. సంబంధిత ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు ప్రతి నెలా 2న వారి పరిధిలో పని చేస్తున్న ఇన్‌స్ట్రక్టర్ల వీధులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

1,209 పొగాకు బేళ్ల తిరస్కరణ

ఒంగోలు గ్రామీణం: జిల్లాలోని రెండు రీజియన్ల పరిధిలోని వేలం కేంద్రాల్లో సోమవారం జరిగిన వేలంలో పలు కారణాలతో 1,209 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. ఎస్‌బీఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు మొత్తం 6,628 బేళ్లను వేలానికి తీసుకురాగా, అందులో 499 బేళ్లు, ఎస్ఎల్ఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు 5,421 బేళ్లు రాగా, అందులో 710 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. వేలం కేంద్రాల్లో పొగాకు కిలో అత్యధిక ధర రూ.250, అత్యల్ప ధర రూ.110 పలికింది.

వెన్నంటి కాపాడు స్వామీ!

• ఇష్ట దైవాలు, పూర్వీకుల సమాధుల వద్ద నిర్వాసితుల కన్నీటి వీడ్కోలు

గొట్టిపడియ రామాలయంలో పూజలు చేసేందుకు వచ్చిన భక్తులు

న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం, మార్కాపురం: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలు ప్యాకేజీలు అందుకుని ఒక్కొక్కరుగా పుట్టిన ఊరును ఖాళీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామంలో తరాలుగా కొలిచిన ఇష్ట దైవాలకు చివరిసారిగా మొక్కుకుంటూ ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామంలోని రామాలయం, పీర్ల చావిడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'తరలిపోతున్నాం.. ఇక తిరిగి రాలేం.. మా వెంట ఉండి కాపాడు స్వామీ' అంటూ దేవుళ్లను మొక్కుకున్నారు. పుట్టి పెరిగిన ఇల్లు, పూర్వీకుల సమాధులు, ఊరి జ్ఞాపకాలను వదిలి వెళ్లాల్సిన పరిస్థితి రావడంతో చివరి క్షణాల వరకూ సొతూర్లలో ఉండి భావోద్వేగానికి గురై తరలిపోయారు.

కనుమరుగవుతున్న 1921 నాటి సుంకేసుల ప్రాథమిక పాఠశాల

గ్రామాలను చూసుకుని, ఇక కనిపించవని..

● కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన దేవాయాలు, మసీదులు, చర్చిలు, పాఠశాలలు ఇక మీదట కనిపించవని వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత ముంపు గ్రామాల ప్రజలు తీవ్ర భావోద్వేగానికి గురై గ్రామాలను వీడి వెళ్లిపోయారు. ● ప్రాజెక్టులోని ముంపు గ్రామాలైన సుంకేసుల, కలనూతల, గుండంచెర్ల, కాటంరాజుతండా, చింతలముడిపి, లక్ష్మీపురం, సాయిరాంనగర్, రామలింగేశ్వరపురం, గొడ్డిపడియ, అక్కచెరువుతండా ప్రజలు తమ ఇల్లు, పొలాలు, పుట్టిన గడ్డను చూసుకుని కన్నీరు పెట్టుకున్నారు. ● కలనూతల గ్రామంలోని పీర్ల మకానంలో ప్రత్యేక పూజలు చేసి అందరూ బోరును విలపించారు. మరి కొంత మంది వారి పూర్వీకులు, ఇటీవల చనిపోయిన వారి కుటుంబ సభ్యుల సమాధులను చూసుకుని కన్నీరు పెట్టుకున్నారు. ● ముంపు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాను అధికారులు సోమవారం కూడా పూర్తిగా నిలిపి వేశారు. దీంతో అన్ని గ్రామాల్లో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. తాగునీటి సరఫరా కూడా ఆగిపోయింది. శుద్ధిజల కేంద్రాల వారు యంత్రాలతో పాటు సామాన్లను తీసుకుని వెళ్లిపోయారు.

నల్లమలసాగర్‌లో కృష్ణమ్మ పరవళ్లు

సుంకేసుల ప్రాంతంలో జల సవ్వడి

దశాబ్దాలుగా తడారిన కరవునేల కృష్ణా జలాల రాకతో కొత్త సింగారాన్ని సంతరించుకుంది. సోమవారం.. . ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి నీటిని విడుదల చేయడంతో పెద్దారవీడు మండలంలోని ముంపు గ్రామాలైన కలనూతల, సుంకేసులకు నీళ్లు చేరాయి. వీటిని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. జలాలను చూసి రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే నిర్వాసితులు ఆయా గ్రామాలను ఖాళీ చేసినా... కొంత మంది పశువులు, గ్రాసాన్ని అక్కడే ఉంచారు. చివరి రోజున వాటిని సైతం పూర్తిగా తరలించారు.

– న్యూస్‌టుడే, పెద్దారవీడు

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 120, రిటైల్ లైవ్ - 147, చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్- 257

బహిరంగ ప్రకటన

మా క్లయింటు ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ-1టౌన్,కెనాల్ రోడ్డు, బావాజీ మఠము సందు, వాస్తవ్యులు డోర్ నెం: 11-58-20, వాస్తవ్యులు లేటు టి.వి నాగేశ్వరరావు గారి కుమారుడు టి.వి.వి.ఎన్.ఎల్.ఎన్. మూర్తి గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా....

మా క్లయింటు, మార్కాపురం జిల్లా, మార్కాపురం టౌన్ ,పేరం బజారు, డోర్ నెం: 7-325-4ఎ, కాపురస్థులు పేరం సత్యన్నారాయణ గారి కుమారుడు పేరం పవన్ కుమార్ గారి వద్ద నుండి ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని ఖరీదు చేయుటకు నిర్ణయించు కొన్నారు. సదరు పేరం పవన్‌కుమార్ గారు షెడ్యూలు దాఖలా ఆస్తిని సూరే వెంకట సుబ్బారావు గారి కుమారుడు సూరె వెంకట రంగ హరికృష్ణ గారి నుండి ది02-01-2025న ఖరీదు చేసి వార్ల వద్ద నుండి మార్కాపురం సబ్ రిజిస్ట్రర్ ఆఫీసులో సేల్ డీడ్ డాక్యుమెంట్ నంబరు : 28/2025 ద్వారాసంక్రమించినది. సదరు సూరె వెంకట రంగ హరికృష్ణ గారికి ది 12.01.2022న విట్టా రంగ లక్ష్మమ్మ భర్త పెద్ద సుబ్బారాయుడు గారు రిప్రజెంటెండ్ బై పవర్ అటార్నీ హోల్డారు విట్టా అనంత రామయ్య గారి నుండి మార్కాపురం సబ్‌రిజిష్టరు వారి ఆఫీసునందు దస్తావేజు నెం: 264/2022 గా స్థిరాస్తి విక్రయ దస్తావేజు ద్వారా సంక్రమించిన ఆస్తి. ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిలో చ.గ. 119 చదరపు గజముల క్రాస్‌లు పోను చ.గ.112.66లు హక్కులతో పేరం పవన్ గారి స్వాధీన హక్కు భుక్తములలో ఉన్నవని మా క్లయింటుకు తెలియ తెలియబరిచినందున , వారి వద్ద నుండి ఖరీదు చేసి రిజిస్టర్డ్ సేల్ డీడ్ ను పొందుటకు నిర్ణయించుకుని ఉన్నారు. అందువలన ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని మా క్లయింటు పై పేరం పవన్ కుమార్ నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకుని యున్నందున ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు గాని, టైటిల్ తాగాయిదాలు గాని, కోర్టు లిటిగేషన్లు గాని, ఇంజక్షన్ దావాలు గాని, భాగ లబ్ధి తాగాయిదాలు గాని, కోర్టు అటాచ్‌మెంట్లు గాని మరే ఇతర తాగాయిదాలు గాని ఉన్న యెడల మాకు గాని, మా క్లయింటుకు గాని ఈ ప్రకటన తేదినుండి 3 రోజులలోగా స్పీడ్ పోస్టు అక్నాలెడ్జిమెంట్ ద్వారా తెలియపరచగలరు. గడువు అనంతరము మా క్లయింటు పేరం పవన్ కుమార్ గారి వద్ద నుండి షెడ్యూల్ ఆస్తిని పూర్తి సేల్ కన్సిడరేషన్ చెల్లించి రిజిస్టర్డ్ క్రయ దస్తావేజును పొందుననియు,గడువు అనంతరము మా క్లయింటు కు గాని మాకు గాని వచ్చే అభ్యంతరములను, మా క్లయింటును బైండు చేయజాలవని ఇందుమూలముగా అందరికి తెలియ జేయటమైనది.

షెడ్యూల్ ఆస్తి

ప్రకాశం జిల్లా, ఒంగోలు రి.డి., మార్కాపురం సబ్.డి., మార్కాపురం టౌన్ మార్కాపురం మున్సిపాలిటీకి చెందిన మార్కాపురం మున్సిపాలిటి పన్ను లెక్కల దాఖలా అసెస్మెంటు నెం. 1034009403రు లోని డోర్ నెం. 7-325-9రుగా గల ఆర్.సి.సి కప్పు గల మిద్దెను నేల మట్టం వరకు పడవేయగా ఏర్పడిన ఖాళీ స్థలము, కంభం రోడ్డు-1 లొకాలిటి స్థిరాస్థికి నెంబరు వారి వివరము. సర్వే నెంబరు 308లో ప్లాటు నెంబరు 10 దాఖలా 119 చ.గ.ల పైకి క్రాసులు పోను 112.66 చ.గ.లు గల ఖాళీ స్థలమునకు హద్దులు :-తూర్పు :మున్సిపాలిటి డ్రైనేజ్ కాలువ, పడమర రోడ్డు, ఉత్తరము :ఏ.రామయ్య మరియు ఎ. శ్రీనివాస్ గార్ల మిద్దె , దక్షిణము :దేవిశెట్టి వెంకటేశ్వర్లు గారి మిద్దె ఈ హద్దులకు లోనైన తూర్పు-పడమర ఉత్తర దిశన 57.3 అ॥లు, తూర్పు-పడమర దక్షిణ దిశన 57 అ॥లు, ఉత్తర-దక్షిణం 17.9 అ॥లు, ఈ కొలతలకు లోనైన 112.66 చ॥గ॥లు గల ఖాళీ స్థలం షెడ్యూలు దాఖలా స్థలమునకు, ఉత్తరం వైపు మరియు దక్షిణం వైపున రాశి గోడ హక్కుతో యూవత్ యూజ్ మెంట్ హక్కులతో

Vijayawada,
Date: 31-08-2026

ఇట్లు
కె.వి.వి.పరమేశ్వరరావు,ఎం.వి.జి. మహీంద్రనాథ్,
న్యాయవాదులు గాంధీనగర్,విజయవాడ-3.
సెల్ నెంబర్ : 9849599248

ఎక్కువ కేసులకు రాజీమార్గం చూపండి

ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ

మార్కాపురం, న్యూస్‌టుడే: సెప్టెంబర్ 12వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ మార్గం అయ్యే విధంగా చేయాలని మార్కాపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో మార్కాపురం పరిధిలోని ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులతో జడ్జి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీకి అవకాశం ఉన్న అన్ని కేసులు రాజీ మార్గం చేయాలన్నారు. 12న జరిగే లోక్ అదాలత్‌ను ఎక్కువ మంది కక్షిదారులు సద్వినియోగం చేసుకునే విధంగా చేయాలన్నారు. రాజీ మార్గం కంటే ఉత్తమమైనది ఏదీ లేదన్నారు. లోక్ అదాలత్‌ను వినియోగించుకుంటే ఉత్తమంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో త్రిబుల్ ఎస్, శ్రీరామ్, ట్రాన్స్‌పోర్ట్, శ్రీరామ్ సిటీ, రామసేతు, పున్నమి తదితర చిట్‌ఫండ్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుడికి కన్నీటి వీడ్కోలు

పుల్లలచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని ఆర్.ఉమ్మడివరం గ్రామానికి చెందిన పవన్‌కుమార్ రెడ్డి(21) అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. కడప శివారులోని సింగపూర్ టౌన్‌షిప్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇతను మృతి చెందాడు. ఇతడి సోదరి లండన్‌లో చదువుతుండగా మరణ వార్త తెలుసుకుని సోమవారం ఉదయం స్వగ్రామానికి రావడంతో అంత్యక్రియలు నిర్వహించారు. కడప ఎస్వీ కాలేజీలో పవన్ బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. మరో ఆరు నెలల్లో కుమారుడు విద్య పూర్తి చేసుకుని కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటాడనుకుంటుండగా ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

పెద్దారవీడు, న్యూస్‌టుడే: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. పెద్దారవీడు మండలం గొబ్బూరు సమీపంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యర్రగొండపాలెం మండలం అమానిగుడిపాడుకు చెందిన స్నేహితులు పుచ్చకాయల లింగయ్య (24), చేపూరి గురురాజచారి (23) మార్కాపురం వెళ్లారు. పని ముగించుకుని ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి బయలుదేరారు. ఇదే సమయంలో హనుమాన్ జంక్షన్‌కుంట వైపు నుంచి మరో ద్విచక్రవాహనం వస్తోంది. అమరావతి-అనంతపురం హైవేపై గొబ్బూరు సమీపంలో ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో లింగయ్య, గురురాజచారికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో ఇద్దరూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దారవీడు పోలీసులు తెలిపారు.

నిర్వాసిత కాలనీ వృద్ధురాలి మృతి

పెద్దారవీడు, న్యూస్‌టుడే: నిర్వాసిత గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు సోమవారం మృతి చెందారు. తమకు పరిహారం అందలేదన్న వేదనతోనే గుండెపోటుతో కుప్పకూలిపోయినట్లు కుటుంబీకులు వాపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. ముంపు గ్రామం కలనూతలకు చెందిన గోతం రోశమ్మ (65) కుటుంబం... ఆదివారం రాత్రే గ్రామాన్ని ఖాళీ చేసి గొబ్బూరుకు తరలివెళ్లింది. సోమవారం ఉదయం గుండెపోటుతో ఆమె మృతి చెందడంతో కుటుంబీకులు ఆవేదనలో మునిగిపోయారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ జమ కాక కొన్నాళ్లుగా బాధపడుతోందని వారు తెలిపారు. ముగ్గురు మనవళ్లకు సైతం పరిహారం అందక మానసికంగా కుంగిపోవడంతోనే ప్రాణాలు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

డీవైఎఫ్ఐ రాష్ట్ర మహాసభల విజయవంతానికి పిలుపు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సెప్టెంబర్ ఒకటి నుంచి మూడో తేదీ వరకు నెల్లూరులో నిర్వహించనున్న భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.ఎఫ్.బాబు పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో సోమవారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య నిరుద్యోగ యువత కోసం పోరాడుతోందని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు రూ.3 వేల భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. విభజన హామీల అమలు కోసం రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రాన్ని నిలదీయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంగా రాష్ట్ర మహాసభల్లో అజెండాగా తీసుకుని కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వి.పిచ్చయ్య, నాయకులు సురేష్, వంశీధర్, సీహెచ్.మోహన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును: బ్యాంకు లలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 73311 65666

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొన బడు ను. (స్పాట్ క్యాష్). ✆ 8142292071.

JOBS

మధుసూదన్ ఆటోఫైనాన్స్ H.O లో పనిచేయుటకు టెలికాలర్స్-5 , అకౌంటెంట్స్-2 కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. ✆ :8886688938, 9246469894.

ప్రముఖ స్టార్ హోటల్ "గీతా రీజెన్సీ" నందు పనిచేయుటకు రుబ్బింగ్, కెప్టెన్స్, వెయిటర్స్, కిచెన్ అసిస్టెంట్స్, రూమ్ సర్వీస్ వెయిటర్స్, ఆర్డర్ టేకర్స్, హౌస్ కీపింగ్ బాయ్స్, కాఫీ స్టాల్, స్టోర్ కీపర్స్, రెస్టారెంట్ ఇంచార్జి మరియు కన్‌స్ట్రక్షన్ సూపర్ వైజర్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతం.సంప్ర.4/1, అరండల్‌పేట గుంటూరు. 9949077525.

SBI LIFE ఉద్యోగ అవకాశాలు నందు నియామకాలు జరుగుచున్నవి వయస్సు18 To 70 సం|| అర్హత 10వ తరగతి ఆపైన సంప్ర: 9640252922.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు..

B/w 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే

వివరాలకు..

97011 12824

ఒంగోలు 80087 09902

మార్కాపురం 80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.

B&W : రూ. 500
Colour : రూ. 700

ప్రకటనలపై 5% GST వర్తించును

పట్టుతప్పితే అంతే సంగతి

పీసీపల్లి- కనిగిరి రహదారిలో సూచికలు లేకుండా ప్రమాదకరంగా వెళుతున్న ట్రాక్టరు

పీసీపల్లి, న్యూస్‌టుడే: ఒక వైపు వర్షాలు లేక, సాగు నీరు అందక పంటలు ఎండిపోతూ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రకృతికి చేటు తెచ్చేలా వాగులు, వంకలు, పొలాల వద్ద ఉన్న చెట్లను అక్రమంగా నరికి వేస్తున్నారు. పీసీపల్లి మండలంలోని ఈ అక్రమ రవాణా నిత్యకృత్యంగా మారింది. దీనికి తోడు ట్రాక్టర్ల వెనుక భాగం పరిమితికి మించి లోడు వేసుకుని రహదారులపై ప్రయాణిస్తున్నారు. ఈ విధంగా ఇరుకైన రోడ్లపై పరిమితికి మించి కర్ర నింపుకుని వెళుతుండటంతో ఎదురుగా వచ్చే వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎలాంటి సూచికలు లేకుండా వెళుతున్న వీటివల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇష్టారీతిన చెట్లను నరికేస్తూ, ప్రమాదకర రీతిలో రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కనిగిరి

• కనిగిరి • గిద్దలూరు

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కొమరోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. దీనికి ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు తమ సమాచారంతో విధిగా హజరు కావాలని ఆయన తెలిపారు.

ఆలయ ఆదాయం రూ.1.60 లక్షలు

సి.ఎస్.పురం: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ. 1,60,894 వచ్చినట్లు ఈవో ఎస్.నరసింహబాబు తెలిపారు. స్వామివారి దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 64,660, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.30,290, స్వామివారి పంచామృత అభిషేకాలకు రూ.5,516, శ్రీపాద కానుకలు ద్వారా రూ.16,548, శాశ్వత అన్నదాన పథకానికి రూ.43,880 విరాళం అందజేశారు.

ఎంపీడీవో సేవలు అభినందనీయం

ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎంఈవోలు ప్రసాదరావు, డేవిడ్

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: అందుబాటులో ఉండి అంకితభావంతో ఎంపీడీవో వి.ప్రతాప్‌రెడ్డి విధులు నిర్వహించారని ఎంఈవోలు జగన్నాధం ప్రసాదరావు, బూదాల డేవిడ్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ప్రాంగణంలో ప్రతాప్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం సోమవారం జరిగింది. పంచాయతీరాజ్ శాఖలో 39 ఏళ్ల పాటు పలు హోదాల్లో విధులు నిర్వహించారని వారు చెప్పారు. ప్రజలు, నాయకులకు అందుబాటులో ఉండేవారని అన్నారు. ఆయన చేసిన సేవలపై వక్తలు కొనియాడారు. ప్రతాప్‌రెడ్డి దంపతులను ఎంఈవోలు, నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉప ఎంపీడీవో వి.బ్రహ్మానందరెడ్డి, కనిగిరి పౌరసరఫరాల శాఖ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వి.మనోహర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.శ్రీనివాసులు, జె.ఎస్.ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డెడ్ స్టోరేజీ నిల్వతో సాగు నీరు ఎలా సాధ్యం

మార్కాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు ద్వారా విడుదల చేసిన 10 టీఎంసీల డెడ్ స్టోరేజీ నిల్వతో 1.19 లక్షల ఎకరాలకు సాగు నీరు, 4 లక్షల మందికి తాగునీరు ఎలా సాధ్యమని సోమవారం ఒక ప్రకటనలో జిల్లా సీపీఎం ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం డ్యామ్‌లోని నీరు అంతంత మాత్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమతువుందా అని అన్నారు. నీటిని వ్యవసాయ భూములకు సరఫరా చేయడానికి కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా, మరమ్మతులకు గురి అయిందన్నారు. తాగునీటి కుళాయిలకు పైపులైన్ల నిర్మాణం నేటికీ కాలేదన్నారు. నిర్వాసితుల సమస్యలను పట్టించుకోకుండా నీటిని విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నేటికీ పట్టాలు, పునరావాసం పూర్తి కాలేదన్నారు. నిర్వాసితులు ఎక్కడ ఉండాలో ప్రభుత్వం చెప్పాలన్నారు. ప్రభుత్వం తక్షణమే నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సోమయ్య డిమాండ్ చేశారు.

వెలుగుల 'వెలిగొండ'.. భావితరాలకు అండ

● 30 ఏళ్ల నిరీక్షణకు తెర ● 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు

కంభం, రాచర్ల, అర్థవీడు, న్యూస్‌టుడే: దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద జరిగిన వెలిగొండ ప్రాజెక్టు నీటి విడుదలకు మండలంలోని రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీని ప్రారంభ సందర్భంగా సీఎం కెనాల్ ఎంట్రీ గేట్లు ఎత్తే సమయంలో కృష్ణా జలాలను చూసేందుకు బస్సులు, వాహనాల్లో భారీగా చేరుకున్నారు. సీఎం చంద్రబాబు మహిళలకు వెండి పూతపూసిన పళ్లేలు బహుమతిగా అందజేశారు. మహిళలు కళ్లపైకి ఎత్తి కృష్ణా జలాలను చూసి ఆనందపడ్డారు. ఆ నీటిని బాటిళ్లలో నింపుకొని తీసుకెళ్లారు.

కంభం: పసుపు కండువాలతో సభకు వస్తున్న మహిళలు

కనిగిరి: తెలుగు తమ్ముళ్లు బయలుదేరారు. మండల, పట్టణ అధ్యక్షులు కొండ కృష్ణారెడ్డి, షేక్ ఫిరోజ్, నాయకుల ఆధ్వర్యంలో వాహనాల్లో అధిక సంఖ్యలో తరలివెళ్లారు. దశాబ్దాల కలను ముఖ్యమంత్రి చంద్రబాబు నిజం చేశారని ఆయన పేరు చిరస్థాయిగా మార్కాపురం జిల్లాలో నిలిచి పోతుందని తెలిపారు. ఆనందంగా జలాలను విడుదల చేయడంతో ఎమ్మెల్యే ఉగ్ర ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కలను సీఎం సాకారం చేయడంతో ఆనందభాష్పాలతో మునిగి పోయారు. ఎమ్మెల్యే పక్కనే ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రోత్సహించారు.

బేస్తవారపేట: ప్రారంభోత్సవానికి తరలివెళ్తున్న తెదేపా శ్రేణులు

సి.ఎస్.పురం: బహిరంగ సభకు అన్ని పంచాయతీల నుంచి తెదేపా శ్రేణులు, రైతులు భారీగా తరలివెళ్లారు. సెల్ఫీలు తీసుకున్నారు. పార్టీ అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, నాయకులు తదితరులు ఉన్నారు.

పామూరు: ఈ ప్రాజెక్టుతో రైతులకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. మోపాడు రిజర్వాయర్‌కు కూడా వెలిగొండ నీరు చేరుతుందని ఎమ్మెల్యే ఉగ్ర ఇచ్చిన హామీతో ప్రజల్లో ఆశలు పెరిగాయని పేర్కొన్నారు.

పీసీపల్లి: ఫ్లోరోసిస్ పీడిత ప్రాంతాల దాహార్తి తీర్చే దివ్య ఔషధం పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు అని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన పంట పొలాలకు సాగునీటి తిప్పలు తప్పుతాయని దీమా వ్యక్తం చేస్తున్నారు.

గిద్దలూరు పట్టణం, బేస్తవారపేట: : తెదేపా నాయకులు, కార్యకర్తలు అక్కడికి వెళ్లడంతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రాజెక్టు వద్దకు వారిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. నాయకుల మద్ది రమేష్, ఇన్‌ఛార్జి ముత్తూరి రాము, పైదులు, వెంకటేశ్వర్లు, రైతులు తరలివెళ్లారు.

హనుమంతునిపాడు: మండలంలోని 23 పంచాయతీల నుంచి ప్రజలు, కార్యకర్తలు మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాహనాలు, బస్సుల్లో తరలివెళ్లారు.

వెండిపూత పూసిన పళ్లేలతో మహిళలు

సి.ఎస్.పురం: బహిరంగ సభలో తెదేపా మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు

కనిగిరి: ప్రాజెక్ట్ పైలాన్ వద్ద తెలుగు తమ్ముళ్లు

నిర్మాణం చేపట్టారు.. వృథా నీరు వదిలేశారు

గిద్దలూరు పురపాలికలోని నటరాజ్ వీధిలో ఓ బహుళ అంతస్తు నిర్మాణం చేపట్టారు. పలువురు యజమానులు గృహ ప్రవేశాలు చేశారు. దీని నిర్మాణం చేపట్టిన స్థిరాస్తి వ్యాపారి ఆ భవనంలో వ్యర్థ నీటిని బయటకు పంపేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేపట్టలేదు. నటరాజ్‌వీధి నుంచి గిద్దలూరు - ముండ్లపాడు రహదారిని కలిపే రోడ్డులోకి మురుగునీటి పైపులైన్‌ను వేసి వదిలివేశారు. దీంతో బహుళ అంతస్తులోని భవనాల నీరు రోడ్డుపైకి చేరి మురుగు కుంటను తలపిస్తోంది. పట్టణ ప్రణాళిక, పురపాలకశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని వృథా నీరు చేరకుండా కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

చెత్త నిల్వతో మురుగు పారేదెలా..

సి.ఎస్.పురం గ్రామంలోని శివాలయం వీధికి దగ్గరలో మురుగు నీరు పారే కాలువ ఇది. కాలువ నిండా వ్యర్థాలు, సంచులు పేరుకుపోయి మురుగు సవ్యంగా పారడం లేదు. దోమల బెడద ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీ అభివృద్ధి అధికారి అదాంబీ చెప్పారు. - న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

ఖాళీ ప్రదేశాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

కనిగిరి పట్టణంలో ఖాళీ ప్రదేశాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. ప్రధానంగా ఎన్జీవో కాలనీ, శివనగర్ కాలనీ, ఇందిరా కాలనీ, బీసీ కాలనీ, బొగ్గుల గొంది కాలనీలో కొందరు స్థలాలు కొనుగోలు చేసి ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా వదిలేశారు. దీంతో ఖాళీ ప్రదేశాల్లో మురుగు చేరి దోమలకు, పందులకు నిలయాలుగా మారి అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. మరుగు ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. మున్సిపల్ అధికార్లు స్పందించి ఖాళీ ప్రదేశాలు లేకుండా గృహాల మధ్య పరిశుభ్రంగా ఉంచేలా యజమానులకు నోటీసులు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కనిగిరి

నియంత్రికకు రక్షణ కరవు

కనిగిరి పట్టణంలోని అంబేడ్కర్ కూడలి సమీపంలోని ప్రయాణికుల ప్రాంగణం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రెండు రోడ్ల మధ్యలో ఉండటం, ఎలాంటి రక్షణ వలయం లేకపోవడంతో ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని స్థానికులు భయపడి పోతున్నారు. పాఠశాలలు అధికంగా ఉండటంతో ఇటు వైపు నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఏదో తూతూ మంత్రంగా వస్త్రాన్ని చుట్టి చేతులు దులుపుకున్నారు. అది కూడా చిరిగిపోయింది. వెంటనే విద్యుత్తు శాఖ అధికార్లు స్పందించి చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కనిగిరి

గుంతుంది చూడండి

కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్ - ఉప్పు రోడ్డు జంక్షన్‌లో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఎప్పుడో 20 ఏళ్ల నాడు డ్రైనేజీపై నిర్మించిన కల్వర్టు కావడంతో దెబ్బతిని కుంగి పోయింది. నిత్యం వాహనచోదకులు ఇటువైపుగా వస్తు ప్రమాదవశాత్తు అందులో పడి పోతున్నారు. ప్రధాన కూడలి కావడంతో నిత్యం ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్‌అండ్‌బీ అధికార్లు స్పందించి ఈ కల్వర్టుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కనిగిరి

ఉపాధ్యాయిని వసంత లక్ష్మిని సన్మానిస్తున్న ఎంఈవో-1 మధుసూదన్‌రెడ్డి, తదితరులు

సమాజాభివృద్ధిలో గురువుల పాత్ర కీలకం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: సమాజాభివృద్ధిలో గురువుల పాత్ర కీలకమని ఎంఈవోలు మధుసూదన్‌రెడ్డి, సి.వి రమణారెడ్డిలు అన్నారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయిని (స్కూల్ అసిస్టెంట్) ఆర్.వసంత లక్ష్మి, ఏబీఎం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పి.వి రాధారమణ ఉద్యోగ విరమణ కార్యక్రమాలను ఆయా పాఠశాలల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు ఇరువురి ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏబీఎం ప్రాథమిక పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ జోబ్ పాల్, ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నకేశవరావును సన్మానిస్తున్న మానవతా సంస్థ సభ్యులు

అనాథల అంత్యక్రియలకు ప్రాధాన్యం

కంభం, న్యూస్‌టుడే : అనాథలు మృతి చెందితే వారి అంత్యక్రియలు చేయాలని మానవతా సంస్థ వైస్ ఛైర్మన్ కాటమాల చెన్నకేశవరావు ప్రతిపాదించారు. స్థానిక సంస్థ కార్యాలయంలో సోమవారం అధ్యక్షుడు ప్రభుదాస్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆ ప్రతిపాదనకు సభ్యులు ఆమోదించారు. సభ్యత్వాలు పెంచాలని సభ్యులు కోరారు. జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికైన చెన్నకేశవరావును సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ మీనిగ ప్రసాద్, సెక్రటరీ పరమేశ్వరరెడ్డి, యేసోబు, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, కొండయ్య, పాల్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కంభం, న్యూస్‌టుడే : విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఎన్నుకున్నారు. మార్కాపురం జిల్లా నూతన అధ్యక్షుడిగా చెరుకుపల్లి సుబ్రహ్మణ్యం ఆచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభకు ముఖ్య అతిథిగా కమ్మరిపల్లె కిరణ్‌కుమార్, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఐక్యంగా ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు.

శంఖారావం పూరిస్తున్న కిరణ్‌కుమార్, అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

బీసీలకు వరం.. స్థానిక ఎన్నికల సమరం

❖ నియోజకవర్గంలో పెరగనున్న ప్రాతినిధ్యం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బీసీ రిజర్వేషన్ల పెంపు ఆయా సామాజిక వర్గాల్లో నూతన జోష్ తీసుకొచ్చింది. గత వైకాపా హయాంలో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించడంతో రాజకీయ పదవులు కోల్పోయామని బీసీ నేతలు ఆవేదన చెందుతున్న తరుణంలో శాసనసభలో 34 శాతం పెంచుతూ కూటమి ప్రభుత్వం ఇటీవల తీర్మానం చేసింది. గ్రామీణులకు 34 శాతం, పట్టణ వాసులకు 33.33 శాతం రిజర్వేషన్లను ఖరారు చేసింది. ప్రస్తుత బీసీ రిజర్వేషన్ల పెంపు ఆయా సామాజిక వర్గాల రాజకీయ ఎదుగుదలకు వరం లాంటిదని ఆ సంఘాల నాయకులు చెబుతున్నారు. కనిగిరి నియోజకవర్గంలోని సి.ఎస్.పురం, పామూరు, పీసీపల్లి, కనిగిరి, హనుమంతునిపాడు, వెలిగండ్ల మండలాల్లోని 135 పంచాయతీలు, కనిగిరి నగర పంచాయతీలో పరిశీలిస్తే బీసీల ప్రాతినిధ్యం ఇలా ఉండనుంది.

కనిగిరి నియోజకవర్గంలో బీసీ రిజర్వేషన్లు ఇలా..

స్థానాలు		బీసీ రిజర్వ్‌డ్
ఎంపీపీలు	- 06	02
జడ్పీటీసీలు	- 06	02
సర్పంచులు	- 135	46
ఎంపీటీసీలు	- 75	26
నగర పంచాయతీ వార్డులు	- 32	11

ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న డీడీవో శ్రీనివాసరెడ్డి

సమస్యలు బోలెడు... చొరవ చూపని అధికారులు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే :

కాలనీ కష్టాలు

వార్డు	:	4వ
గృహాలు	:	2,500
జనాభ	:	4,100

గిద్దలూరు పురపాలికలోని 3వ వార్డులో స్థానికులకు సమస్యలు వెంటాడుతున్నాయి. ఏబీఎం పాలెంలో పలు చోట్ల మంచినీటి పైపులైన్లు లీకేజీలతో నీరు వృథాగా పోతున్నాయి. పలు వీధుల్లో సైడ్ కాలువ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, పూడిక తీయకపోవడంతో మురుగు ముందుకు కదలక దోమలకు నిలయంగా మారాయి. ఏబీఎం పాలెంలోని ఎంఆర్‌సీ భవనం పక్కన ఉన్న ఖాళీ స్థలం నిరుపయోగంగా ఉంది. వార్డులోని ప్రజలు ఉపయోగించుకునేందుకు వీలుగా సామాజిక భవనం ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. వేసవికాలంలో నీటి ఎద్దడితో స్థానికులు అవస్థలు పడుతున్నారు. నరసింహస్వామి కొండ ప్రాంతంలో విద్యుత్తు లైన్లు, వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో సీసీ రోడ్లు దెబ్బతిన్నప్పటికీ వాటిని సవరించడంలో పురపాలకశాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి

రాజుపాలెం (కొమరోలు గ్రామీణం), న్యూస్‌టుడే: గిద్దలూరు నుంచి స్వగ్రామానికి వస్తూ అదుపు తప్పి ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన సంఘటన రాజుపాలెం వద్ద చోటుచేసుకుంది. వివరాల ప్రకారం బాదినేనిపల్లెకు చెందిన కామూరి రామచంద్రా రెడ్డి(55) వ్యక్తిగత పనులు నిమిత్తం గిద్దలూరుకు వెళ్లి తిరిగి బైకుపై వస్తుండగా, రాజుపాలెం వద్ద అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు నంద్యాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలి

కనిగిరి, న్యూస్‌టుడే: జ్ఞాన జ్యోతి శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రీస్కూల్లో అమలు చేయాలని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పార్వతి తెలిపారు. సోమవారం మండలంలోని గురువాజీపేటలో కార్యకర్తలకు సెక్టార్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను చిన్నారులకు బోధించి సంఖ్య పెంచాలన్నారు. కేంద్రాల్లో బోధనోపకరణాలను అంశాల వారిగా ప్రదర్శించి పిల్లల బరువులను, ఎత్తులను జాగ్రత్తగా తీసి, గృహ సందర్శన ద్వారా చిన్నారు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి మిషన్ సాక్ష్యం కింద అంగన్‌వాడీ నిర్వహణ కమిటీలను పూర్తి చేయాలన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్ గురించి తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. లబ్ధిదారులకు పోషకాహారం సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పార్వతి

సొంతవి లేవు.. అద్దె భవనాలే దిక్కు

కనిగిరి, న్యూస్‌టుడే:

గత వైకాపా ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసింది. కాని సొంత భవనాలు ఏర్పాటు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో 12 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో నాలుగు సొంత భవనాలు లేక తరగతులు జరగని పాఠశాలలు, మెప్మా కేంద్రాల్లో శిథిలావస్థకు చేరిన గదుల్లో నడుస్తున్నాయి. ఎనిమిది సచివాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం వీటిని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలుగా పేరు మార్చింది.

అద్దె భవనాల్లో విధులు..

సచివాలయ వ్యవస్థ ఏర్పడి 6 ఏళ్లు దాటినా నేటికి గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని చోట్ల నిర్మాణాలు నిధుల లేమితో వదిలేసింది. మున్సిపాలిటీలో అస్సలు వీటి నిర్మాణాల ఊసే లేకుండా పోయింది. 12 సచివాలయాల్లో నాలుగు ప్రభుత్వ పురాతన భవనాల్లో అరకొర వసతుల మధ్య నడుస్తుండగా.. మిగతా ఎనిమిది అద్దె భవనాల్లో విధులు నిర్వహిస్తున్నాయి. రూ.ఒక్కో భవానికి సుమారు రూ. 11 వేలు వరకు అద్దె చెల్లిస్తూ నడుపుతున్నారు.


శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల గదిలో నిర్వహిస్తున్న ఒకటో సచివాలయం

ఉద్యోగులకు, ప్రజలకు తప్పని పాట్లు

సొంత భవనాలు లేకపోవడంతో అరకొర వసతులతోనే సచివాలయ ఉద్యోగులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. అద్దె భవనాల్లో మరుగుదొడ్లు సౌకర్యాలు లేవు. సమస్యలు విన్నవించుకునేందుకు, ధ్రువపత్రాలు, ఇతర పనుల కోసం వచ్చిన ప్రజలు సైతం కాసేపు కూర్చునేందుకు వీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి కనిగిరి మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలను గుర్తించి నూతనంగా సచివాలయాలు నిర్మిస్తే ఉద్యోగులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పోతాయి.

ఇండియన్ ఆయిల్ డే
పొదుపు చేస్తే ఇంధనమే...
నిర్లక్ష్యం చేస్తే భావితరాలకు ముప్పు...
వృథాను అరికడితే మేలు...
మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు జాతీయ ఇంధన పొదుపు దినోత్సవ శుభాకాంక్షలు
బొగ్గరపు ఆంజనేయులు
మేనేజర్: ధనలక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్. IOC Petrol Bunk కొమరోలు

LIC 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
ఖాతాదారులకు విశేష సేవలు అందిస్తూ గత 70 సంIIలుగా 'మీ భవిష్యత్ మా బాధ్యత' అనే నినాదంతో ముందుకు పోతున్న LIC OF INDIA నా పాలసీ దారులందరికీ నా హృదయపూర్వక 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు.
మీ భవిష్యత్ మా బాధ్యత
కొళ్ళి వెంకటహరినాథ్‌బాబు
LIC ఏజెంట్ మరియు పోస్టల్ ఏజెంట్
సెల్: 8977951399

LIC 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
ఖాతాదారులకు విశేష సేవలు అందిస్తూ గత 70 సంIIలుగా 'మీ భవిష్యత్ మా బాధ్యత' అనే నినాదంతో ముందుకు పోతున్నLIC OF INDIA నా పాలసీ దారులందరికి నా హృదయపూర్వక 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
మీ భవిష్యత్ మా బాధ్యత
బొర్రా రామక్రిష్ణయ్య
LIC ఏజెంట్- CLIA రెడ్డిచర్ల
కొమరోలు మండలం

LIC ఎల్.ఐ.సి 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ఎల్.ఐ.సి 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
కోటా సత్యనారాయణ, LIC ఏజెంట్, గిద్దలూరు

(c) eenadu

పాతూరు నుంచి వెళ్తున్న తెదేపా నాయకులు మహిళలు

మార్కాపురం
•మార్కాపురం • యర్రగొండపాలెం

మార్కాపురం గ్రామీణం: వేములకోట నుంచి బయలుదేరిన తెదేపా కార్యకర్తలు

నాగరాజుకుంట నుంచి తెదేపా నాయకులు, కార్యకర్తలు

తర్లుపాడు: ఉత్సాహంతో వెళ్తున్న మీర్జాపేట వాసులు

పుల్లలచెరువు: కవలకుంట్లలో ప్రజలు

అన్ని దారులూ.. వెలిగొండ వైపే..

• జల దృశ్య వేడుకకు జన వెల్లువ

న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం, వై.పాలెం, వై.పాలెం పట్టణం, పెద్దదోర్నాల, పుల్లలచెరువు, తర్లుపాడు, కొనకనమిట్ల పెద్దారవీడు: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఈప్రాంత ప్రజల భావోద్వేగం. సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు దోర్నాల మండలం, గంటావాని పల్లెలో ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేయడంతో మార్కాపురం జిల్లా అంతటా ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. తమ జీవితాల్లో అత్యంత విలువైన ఈ చారిత్రక ఘట్టాన్ని కళ్లారా వీక్షించేందుకు జిల్లాలోని నలు మూలల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మార్కాపురం మండలంలోని వేములకోట, కె.కొత్తపల్లి, రాయవరం, నికరంపల్లి, జమ్మనపల్లి తదితర గ్రామాలతో పాటు పట్టణం నుంచి ఆర్టీసీ బస్సులు, పాఠశాలల బస్సులు, ఇతర వాహనాల్లో మహిళలు, వృద్ధులు, యువత, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా బయలుదేరారు.

• తర్లుపాడు: తర్లుపాడు మండల ప్రజలు ఆనంద బాష్పాలతో గంటవానిపల్లికి చేరుకున్నారు.

• పుల్లలచెరువు మండలంలో ఉదయం నుంచే ప్రజలు బృందాలుగా బయలుదేరుతుండడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. వెలిగొండ ప్రాజెక్టుతో కృష్ణ జలాలు తమ మండలానికి కూడా వచ్చేలా తీగలేరు 5 కాలువను పొడిగించాలని ప్రజలు కోరుతున్నారు.

• పొదిలి: పొదిలి పట్టణంలోని అన్ని వార్డులతోపాటు ప్రతి గ్రామం నుంచి ప్రజలు తరలివెళ్లారు. వారిలో ఆయా గ్రామాల తెదేపా నాయకులు, క్లస్టర్, వార్డు, బూత్ ఇన్‌ఛార్జిలు, నాయకులు ఉన్నారు. •కొనకనమిట్ల: మండల తెదేపా అధ్యక్షుడు బాబు రావు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభించడంతో సాగు, తాగునీరు సమస్య పరిష్కారం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాషాపతి నాయుడు, కాశిరెడ్డి, మాజీ సర్పంచి సుఖ్‌దేవ్, కామసాని రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో చివరి వివాహం

సుంకేసుల: చర్చికి వెళ్తున్న నూతన జంట, పెళ్లి బృందం

పెద్దారవీడు, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామమైన సుంకేసుల ఎస్సీ కాలనీలో సోమవారం చివరి పెళ్లి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఓ పక్క వెలిగొండ ప్రాజెక్టు నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు తరలిరాగా, మరో పక్క పెళ్లి బాజాల మధ్య ఓ జంట ఒక్కటయ్యారు. దాదాపు అన్ని ముంపు గ్రామాలను ఖాళీ చేసి వెళ్లిన నేపథ్యంలో ఇదే చివరి వేడుక అని పెళ్లి బృందం తెలిపారు. తమ పూర్వీకులు కట్టిన ఇంట్లో, తాము పుట్టి పెరిగిన గ్రామంలోనే పెళ్లి చేసుకోవాలనే పట్టుదలతో ఈ వేడుకను నిర్వహించినట్లు తెలిపారు. మధ్యాహ్నం చర్చిలో ప్రార్థనల అనంతరం నూతన జంట, వారి కుటుంబ సభ్యులు ఇంటిని ఖాళీచేసి వెళ్లిపోయారు.

● ముంపు గ్రామాలను ఖాళీ చేస్తున్న నేపథ్యంలో కొందరు తమతో పాటుగా ఇన్ని రోజులు ఇష్టంగా పెంచుకున్న కుక్కలను వాహనాల్లో తీసుకెళ్తున్న దృశ్యాలు సోమవారం దారిపొడవునా కనిపించాయి. ముంపు గ్రామాల్లోని గుండంచర్ల, కలనూతల, సుంకేసులకు చెందిన నిర్వాసితులు సోమవారం ఎక్కువ మంది గ్రామాలను ఖాళీ చేసి వెళ్లిపోయారు. తమను నమ్ముకున్న మూగజీవాలను వారితో పాటుగా తీసుకుని వెళ్లి పెంచుకుంటామని, వెలిగొండ ప్రాజెక్టు నీళ్లలో మూగజీవాలు ఇబ్బంది పడతాయని రెండు శునకాలను తాము తీసుకెళ్తున్నట్లు కలనూతలకు చెందిన ఓ యువకుడు వివరించాడు.

కలనూతల: వాహనంలో సామగ్రితోపాటు శునకాన్ని తరలిస్తున్న యువకుడు

గార్లదిన్నె నుంచి.. మహిళలు, యువకులు

ఎల్ఈడీ తెరపై సీఎం ప్రసంగం వీక్షణ

ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా చంద్రబాబు మాట్లాడటాన్ని చూస్తున్న జనం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించి జాతికి అంకితం చేసిన దృశ్యాలను యర్రగొండపాలెంలో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలు తిలకించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ వద్ద జనం చేరుకుని చంద్రబాబు హెలికాప్టర్‌లో వచ్చినప్పటి నుంచి ప్రారంభోత్సవం, జాతికి అంకితం చేసిన దృశ్యాలతోపాటు బహిరంగ సభలో ఆయన ప్రసంగాన్ని ప్రజలు తిలకించారు. ఎప్పటి నుంచో ప్రజలు ఆశతో ఎదురు చూసిన ఈ ప్రాజెక్టు ఎట్టకేలకు ప్రారంభించి నీరు విడుదల చేసిన దృశ్యాలను ప్రజలు ఆనందంతో చూస్తూ బాణసంచా కాల్చారు. చంద్రబాబు ప్రసంగాన్ని ఎంతో జాగ్రత్తగా విన్నారు.

కృష్ణమ్మకు హారతి ఇవ్వడం అదృష్టం

పొదిలి: వెలిగొండ ప్రాజెక్టులోకి వచ్చిన కృష్ణమ్మకు హారతి ఇచ్చి పసుపు కుంకుమ సమర్పించడం నాకు ఎంతో ఆనందం కలిగించింది. మా ప్రాంతానికి నీరు వస్తుంటే చూడటానికి రెండు కళ్లు సరిపోవడంలేదు. పొదిలి నుంచి మేము 30 మంది మహిళలం టన్నెల్ వద్దకు వెళ్లాం. సీఎం పూజ చేసిన దగ్గరే మేము అమ్మవారికి పండ్లు, కాయలు సమర్పించాం. కృష్ణమ్మను బాటిల్‌లో పట్టుకుని ఇంటికి తెచ్చుకున్నాం. రైతులకు, ప్రజలకు సాగు, తాగు నీటి కష్టాలు తీరబోతున్నాయి. **- సోమిశెట్టి శ్రీదేవి, ఏఎంసీ డైరెక్టర్ పొదిలి**

హెలికాప్టర్‌లో వచ్చిన ఎంపీ

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: దోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలో సోమవారం జరిగిన ముఖ్యమంత్రి వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభ కార్యక్రమానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రత్యేకంగా చెన్నై నుంచి హెలికాప్టర్‌లో వచ్చారు. ముఖ్యమంత్రి రాకకు గంట ముందు ఆయన ఇక్కడకు చేరుకున్నారు. సభలో ఎంపీ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు తనకు ఫోన్ చేసి రమ్మని పిలిచారనీ ఆయన కోరిక మేరకు వచ్చానని, నీటిని చూసిన తరువాత ఒక్కసారిగా ఆనంద బాష్పాలు కళ్లవెంట జాలువారాయని అన్నారు. మహత్తర కార్యక్రమానికి తనను పిలిచినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అంతకు ముందు గాలిలో హెలికాప్టర్‌ను చూసిన ప్రజలు ముఖ్యమంత్రి వచ్చారని హెలిప్యాడ్ వైపు పరుగులు తీశారు. హెలికాప్టర్‌లో నుంచి ఎంపీ దిగడంతో చప్పట్లు కొట్టారు.

సొంతింటి కల.. ఆలస్యమేనా..!

మండలంలోని కుందంపల్లిలో ఉన్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. కాలనీలో సుమారు 10 ఇళ్లు చివరి దశలో ఉన్నాయని లబ్ధిదారులు తెలిపారు. సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లోనే జీవనం గడపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిలో రాత్రి అయితే జోరుగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ఇళ్ల నిర్మాణాలని తిరిగి ప్రారంభించి తమ సొంత ఇంటి కలను సాకారం చేయాలని కోరతున్నారు. ● గత ప్రభుత్వం వీటి ఆరంభానికి ఉత్సాహం చూపి తరువాత పట్టించుకోలేదు. కనీసం కూటమి ప్రభుత్వమైనా ఇళ్ల నిర్మాణానికి చొరవ చూపాలని ప్రజలు విన్నవించారు. **- న్యూస్‌టుడే, పుల్లలచెరువు**

త్రిపురాంతకం: తెదేపా మండల అధ్యక్షుడు వలరాజు, కార్యకర్తలు, మహిళలు

మార్కాపురం గ్రామీణం: దోర్నాలకు వెళ్తున్న మహిళలు, తెదేపా నాయకులు

ఉప్పొంగిన ఉత్సాహం

మార్కాపురం అర్బన్: తమ ప్రాంతానికి కృష్ణా జలాలు వస్తాయని కలలో కూడా ఊహించలేదని మార్కాపురం ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గేట్లు ఎత్తి నల్లమల సాగర్ జలాశయానికి నీటిని విడుదల చేయడంతో సాయంత్రానికి అవి మార్కాపురం సమీపంలోని జలాశయానికి చేరుకున్నాయి. 30 ఏళ్లుగా నిత్యం కరవు కాటకాలతో అల్లాడుతున్న తమ భూములను కృష్ణమ్మ జలాలు తాకడం ఎంతో ఆనందంగా ఉందని రైతులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఫీడర్ కెనాల్ ద్వారా చేరుకుని పరవళ్లు తొక్కుతున్న నీటిని కనులారా చూసేందుకు ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నీళ్లలోకి దిగి తలపై చల్లుకున్నారు. మరికొందరు పిల్లలకు చూపిస్తూ ఈ నీరు ఎంతటి చారిత్రక ఘట్టానికి ప్రతీకో వివరిస్తున్నారు.

కలనూతలలో జలాలను చూసేందుకు వచ్చిన ప్రజలు

నల్లమల సాగర్‌కు చేరుకుంటున్న కృష్ణా నీళ్లు

మల్లికార్జునరావు దంపతులను సన్మానిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

విద్యార్థుల బంగరు భవితకు బాటలు

పొదిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో 37 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన ఉపాధ్యాయుడు గుర్రం మల్లికార్జునరావు అని ఎంఈఎఫ్ నాయకులు ఐజాక్‌బాబు, రామారావు అన్నారు. తూర్పు వెంకటాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన మల్లికార్జునరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు పద్మారావు, కోటేశ్వరరావు, ఎజ్రా, నరసింహారావు, జయానందం తదితరులు పాల్గొన్నారు.

డెడ్ స్టోరేజీ నీటితో సాగు నీరు ఎలా సాధ్యం

మార్కాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు ద్వారా విడుదల చేసిన 10 టీఎంసీల డెడ్ స్టోరేజీ నీటితో 1.19 లక్షల ఎకరాలకు సాగు నీరు, 4 లక్షల మందికి తాగునీరు ఎలా సాధ్యమని సోమవారం ఒక ప్రకటనలో జిల్లా సీపీఎం ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం డ్యామ్‌లోని నీరు అంతంత మాత్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమతువుందా అని అన్నారు. నీటిని వ్యవసాయ భూములకు సరఫరా చేయడానికి కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా, మరమ్మతులకు గురి అయిందన్నారు. తాగునీటి కుళాయిలకు పైపులైన్ల నిర్మాణం నేటికీ కాలేదన్నారు. నిర్వాసితుల సమస్యలను పట్టించుకోకుండా నీటిని విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నేటికీ పట్టాలు, పునరావాసం పూర్తి కాలేదన్నారు. నిర్వాసితులు ఎక్కడ ఉండాలో ప్రభుత్వం చెప్పాలన్నారు. ప్రభుత్వం తక్షణమే నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సోమయ్య డిమాండ్ చేశారు.

క్రీడా వికాస కేంద్రం వెనుక తెరుచుకున్న సెప్టిక్ ట్యాంకులు

మూతలు వేయకపోతే ప్రమాదమే..!

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రీడా వికాస కేంద్రం ఉంది. దీని వెనకాల రెండు సెప్టిక్ ట్యాంకులున్నాయి. వాటిపై మూతలు గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. అవి తెరుచుకు ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ నిత్యం విద్యార్థులు ఆటలాడుతుంటారు. తెల్లారు జామున, సాయంత్రం వాకింగ్ చేసే యువత, వృద్ధులు నిత్యం దీని పక్కనుంచే నడుస్తుంటారు. పై మూతలు లేక పోవడంతో పొరపాటున వాటిలో పడే ప్రమాదం ఉంది. వీటిని మూసి వేసి ప్రమాదం ఏర్పడకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు. క్రీడా వికాస కేంద్రం నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రహరీ కరవు.. పాఠశాలకు రక్షణ బరువు

మండలంలోని నడిగడ్డ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో రక్షణ కరవైంది. గ్రామ శివారులో చెరువు పక్కన ఉండటంతో పశువులు తిరుగుతున్నాయని, దీంతో అపరిశుభ్రంగా మారుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ నిర్మించక పోవడంతో పాఠశాలకు రక్షణ కరవైంది. తాగునీటి కుళాయిలు విరగొట్టారు. వీటితో పాటు పలు వస్తువులు ధ్వంసమయ్యాయి. విద్యార్థులకు సైతం అసౌకర్యంగా మారింది. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఎప్పుడు ఇంటికి వెళ్తారో ఎప్పుడు వస్తారో కూడా తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో పాఠశాలకు రక్షణగా ప్రహరీ గోడను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
- త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే

ఆగిన నీటి సరఫరా.. తప్పని కష్టాలు

ఎన్ఏపీ సంపు బయట కుళాయివద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి నగర పంచాయతీకి దర్శి నుంచి తాగునీటి సరఫరా నిలిచింది. దర్శి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి పొదిలికి శని, ఆదివారాలు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. అయితే అక్కడ పని చేసే సిబ్బందికి కొన్ని నెలలుగా వేతనాలు అందకపోవడంతో సమ్మె చేస్తున్నట్లు కొందరు తెలిపారు. దీంతో పొదిలికి నీటి సరఫరా నిలిచిపోయింది. అసలే వచ్చేది వారానికి మూడు రోజులు...ఆపై పలు కారణాలతో నీటి సరఫరా ఆగడంతో పొదిలి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పొదిలి నగర పంచాయతీ ప్రజలకు ప్రధాన తాగునీటి ఆధారం ఎన్ఏపీ నీరే. అవి నిలిచిపోతే పట్టణ ప్రజలు డబ్బా నీటిని కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి నెలకొంది. కొంత మంది ప్రజలు ఎన్ఏపీ సంపు బయట ఉన్న కుళాయివద్దకు డబ్బాలతో వచ్చి నీటిని పట్టుకెళ్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, తమ నీటి ఇక్కట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలి

కనిగిరి, న్యూస్‌టుడే: జ్ఞాన జ్యోతి శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రీస్కూల్లో అమలు చేయాలని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పార్వతి తెలిపారు. సోమవారం మండలంలోని గురువాజీపేటలో కార్యకర్తలకు సెక్టార్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను చిన్నారులకు బోధించి సంఖ్య పెంచాలన్నారు. కేంద్రాల్లో బోధనోపకరణాలను అంశాల వారిగా ప్రదర్శించి పిల్లల బరువులను, ఎత్తులను జాగ్రత్తగా తీసి, గృహ సందర్శన ద్వారా చిన్నారు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి మిషన్ సాక్ష్యం కింద అంగన్‌వాడీ నిర్వహణ కమిటీలను పూర్తి చేయాలన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్ గురించి తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. లబ్ధిదారులకు పోషకాహారం సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచి పట్టింది.. రోగ భయం పెంచింది

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెం అంబేడ్కర్‌నగర్‌లో మంచి నీటి ట్యాంకు పాచి పట్టి అపరిశుభ్రతకు నిలయంగా మారింది. పంచాయతీ వారు దీనిని శుభ్రం చేసే విషయంలో తగిన చొరవ చూపడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ట్యాంకు చుట్టూ పాచి పట్టింది. కుళాయిలు ఇరిగిపోయాయి. అయినా ఈ ట్యాంకు వద్దనే మహిళలు నీరు పట్టుకోవాల్సి వస్తోంది. పాచి పట్టడంతో కొన్నిసార్లు జారి పడుతున్నారు. ట్యాంకు వద్ద బ్లీచింగ్ చల్లడం లేదు. పంచాయతీ వారికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పాచి పట్టిన నీటిని తాగడం వల్ల ఎప్పుడు ఏ రోగం బారిన పడతామోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ వారు ట్యాంకును శుభ్రం చేసి కొత్తకుళాయిలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పూల సుబ్బయ్య కల నెరవేరింది: సీపీఐ

పూల సుబ్బయ్య విగ్రహానికి పూల మాలలు వేస్తున్న సీపీఐ నాయకులు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రకాశం ప్రజలకు సాగు, తాగు నీరు అందించాలన్న సీపీఐ మాజీ ఎమ్మెల్యే దివంగత పూల సుబ్బయ్య కల నెరవేరిందని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జి.గురునాథం అన్నారు. సీఎం చంద్రబాబు పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు నీరు వదిలి ప్రారంభోత్సవం చేసి జాతికి అంకితం చేసిన సందర్భంగా సోమవారం వై.పాలెంలోని పూలసుబ్బయ్య విగ్రహానికి సీపీఐ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగించారు. కరువు నేలకు కృష్ణమ్మ రావాలి అనే నినాదంతో పూల సుబ్బయ్య ప్రజలతో కలిసి ఎన్నో పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా చట్టసభల్లో మాట్లాడారన్నారు. 1929 జూన్ 29న కంభంలో జన్మించిన ఆయన ఉపాధ్యాయుడిగా, న్యాయవాదిగా పని చేస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేశారన్నారు. 1962, 1967లో యర్రగొండపాలెం నుంచి, 1978లో మార్కాపురం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది వెలిగొండ ప్రాజెక్టు కోసం గుజ్జుల యల్లామందారెడ్డి వంటి వారితో కలిసి పోరాటాలు జరిపినట్లు వారు గుర్తు చేశారు. సీఎం చంద్రబాబుతో పూలసుబ్బయ్య కల నెరవేరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తిరుమలయ్య, నక్కా తిరుపతయ్య, ఆవుల యోగయ్య, ఎస్కే.ఖాసీం పాల్గొన్నారు.

రూ.కోట్ల వ్యయం... దారులు అధ్వానం..

• కానరాని మరమ్మతులు

కంకరతో నిండిన అంబాపురం రోడ్డు

న్యూస్‌టుడే, కొనకనమిట్ల

మార్కాపురం డివిజన్లో రోడ్ల నిర్వహణ రోజు రోజుకు అధ్వానంగా తయారవుతోంది. దీంతో కంకర తేలి, గుంతలు పడి, తారుకు నోచక ఇలా రోడ్లు రాకపోకలకు వీలుకాకుండా పోతున్నాయి. వీటి మరమ్మతులకు రూ. కోట్లు కుమ్మరిస్తున్నట్లు చెబుతున్నా కార్యాచరణ సక్రమంగా ఉండటంలేదు. ఫలితంగా ప్రజాధనం వృథా అవుతోంది. ఇందుకు తాజా ఉదాహరణగా నిలుస్తున్నాయి కొనకనమిట్ల పరిధి రహదారులు.

రూ.4.20 కోట్లతో పనులు ప్రారంభం

కొత్తపల్లి కూడలి- అంబాపురం రోడ్డు అధ్వానంగా ఉంది. కంకర పరిచి తారు ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కాపురం- ఒంగోలు రహదారి నుంచి పలు గ్రామాలను కలిపే అనుసంధానం రోడ్డు ఇది. అయిదు కిలో మీటర్లు రూ.4.20కోట్ల రహదారి పనులు ప్రారంభించారు. నిత్యం 50 మంది ప్రజలు పనుల కోసం బయట వెళ్లడానికి నానా పాట్లు పడుతున్నారు. ఆరు సంవత్సరాల క్రితమే పనులు ప్రారంభించి తారు వేయకపోవడంతో రోడ్డు మొత్తం పాడైపోయింది.

కిందపడి గాయాల పాలవుతున్నారు

పొదిలి- నంద్యాల మార్గంలోని చిన్నారికట్ల, గొట్లగట్టు, చినమనగుండం గ్రామాల్లో రహదారిపై గుంతల పడ్డాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో గుంతలు పడి కంకర లేచి ప్రమాదకరంగా మారినా పట్టించుకునే వారు కరవయ్యారు. ఓవైపు పూర్తిగా తారు రోడ్డు దెబ్బతింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహన చోదకులు అక్కడికి వచ్చే సరికి గుంతలు తప్పించే క్రమంలో కింద పడి గాయాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

చినమనగుండం వద్ద..

బిల్లులు రాగానే పనుల పూర్తిచేస్తాం

ఈ విషయమై పీఆర్ ఏఈ శ్రీనువాస రెడ్డి మాట్లాడుతూ.. బిల్లులు మంజూరు కావాల్సి ఉందన్నారు. రాగానే పనులు పూర్తి చేస్తామని వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
యర్రగొండపాలెం : 8008552658

కొనకనమిట్ల: ?: కొనకనమిట్ల మండలంలోని విరసలగుండం గ్రామంలో అంతర్గత దారులు అధ్వానంగా ఉన్నాయి. కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించాలి. **– కాశయ్య, స్థానికుడు**
✓:ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం. **– ఈశ్వరమ్మ, ఎంపీడీవో**

పుల్లలచెరువు: ?: మండల కేంద్రంలోని అంజన్న కాలనీలో ఒక్క రోడ్డు లేదు. దీంతో వర్షాలు పడితే ఇబ్బందిగా ఉంటోంది. **– అంజన్న కాలనీ వాసులు, పుల్లలచెరువు**
✓: నిధులు రాగానే సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. **– ఆత్మనంద నాయుడు, పీడీవో, పుల్లలచెరువు**

యర్రగొండపాలెం పట్టణం: ?: వై.పాలెంలోని అంబేడ్కర్‌నగర్ చివర ప్రభుత్వ పాఠశాల రహదారిలో వీధిలైట్లు వెలగడం లేదు. రాత్రి వేళ పాదచారులకు ఇబ్బందిగా మారింది. సమస్య తీర్చాలి. **- అచ్చయ్య, స్థానికుడు**
✓: పంచాయతీ సిబ్బందిని పంపించి సమస్య తీరుస్తాం. **– శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ.**

కొనకనమిట్ల: ?: మండలంలోని గరిమినపెంట పంచాయతీ పాతపాడులో రహదారిపై మురుగు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. **- వెంకటయ్య, పాతపాడు.**
✓: రహదారిపై నీరు నిల్వ ఉండకుండా సమస్య పరిష్కరిస్తాం. **- శ్రీదేవి, ఈవోఆర్డీ**

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.60 లక్షలు

సి.ఎస్.పురం: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.1,60,894 వచ్చినట్లు ఈవో ఎస్.నరసింహబాబు తెలిపారు. స్వామివారి దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.64,660, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.30,290, స్వామివారి పంచామృత అభిషేకాలకు రూ.5,516, శ్రీపాద కానుకలు ద్వారా రూ.16,548, శాశ్వత అన్నదాన పథకానికి రూ.43,880 విరాళం అందజేసినట్లు పేర్కొన్నారు.

(c) eenadu